www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబరు 2025
5
చిత్తూరు



మొరవపోతున్న చెన్నపట్నం చెరువు

ప్రజాశక్తి - సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు ఇటీవల కురుస్తున్న వర్షాలకు నిండుకుండలా మారి శనివారం ఉదయం నుండి మొరవ పోతోంది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి. 250 ఎకరాల విస్తీర్ణం, 500 నుండి 600 ఎకరాల ఆయకట్టు కలిగి జమీందార్ల పాలనలో నిర్మించిన చెన్నపట్నం చెరువు నిండడం వల్ల ఈ ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తీరినట్లు అయ్యింది. చెరువు నిండి మొరవపోవడం కారణంగా మొరవకు దిగువ ప్రాంతంలో గువ్వల గుట్ట ఎస్టీ కాలనీకి వెళ్లే డైవర్షన్ రోడ్డు ప్రవాహం కారణంగా కొట్టుకుపోవడంతో గువ్వల గుట్టకు రాకపోకలు నిలిచిపోయాయి. 15 కుటుంబాల వారు గువ్వల గుట్టలో నివాసం ఉంటున్నారు సరైన దారి సౌకర్యం లేక కనీస వసతులు కరువై ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు సంవత్సరాలకు క్రితం కురిసిన భారీ వర్షానికి చెన్నపట్నం చెరువు నిండి మొరవ వేగంగా వెళ్లడంతో గతంలో ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది. ఆ తర్వాత తాత్కాలిక రోడ్డు వేసి శాశ్వత రోడ్డు కోసం ప్రయత్నాలు చేయకపోవడంతో గువ్వల గుట్ట వాసులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. 2003లో జన్మభూమి గ్రామ సభలో పాల్గొనేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇరికిపెంటకు వచ్చి చెన్నపట్నం చెరువు అభివృద్ధి కోసం 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. అయితే ప్రకటన మాత్రమే మిగిలి నిధులు రాకపోవడంతో ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోక పోవడంతో జమీందార్ల కాలంలో నిర్మించిన కట్ట ఎగువ దిగువ తూములు బలహీనంగా మారాయని రైతులు అంటున్నారు. భారీ వర్షాలు కురిసి మొరవ మరింత వేగంగా పరవళ్లు తొక్కితే జీడిరేవుల వంక వద్ద గతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

గువ్వల గుట్టకు స్తంభించిన రాకపోకలు



నీటి ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు




మొరవ పోతున్న చెన్నపట్నం చెరువు

అధికారులు పూర్తిస్థాయిలో చెరువుల పరిస్థితిని పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి భారీ వర్షాల కారణంగా బలహీనంగా ఉన్న చెరువు కట్టలను, మొరవలను బాగు చేయాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

జలజల చెలిమి చేను జలపాతం..

గుండెల్లో పులకించిన ఆనందం

ప్రజాశక్తి - రామకుప్పం: పచ్చదనంతో నిండు కున్న ఎత్తయినా కొండలు, చల్లని గాలి హొయలు, పక్షుల కిల..కిల రావాలు, చిక్కని పాల ప్రవాహం పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోందన్న రీతిలో గలగల పారుతూ ప్రవహించే సెలయేరు.. ప్రకృతి ప్రేమికుల మనసుల ను కొల్లగొట్టే ఈ సుందర రమణీయ దృశ్యాలు కేవలం చెలిమి చేను జలపాతం సొంతం. మండలంలోని అటవీ ప్రాంతమైన వీర్ణమల సమీపంలోని చెలిమి చేను జలపాతం ప్రస్తుతం కురుస్తున్న వర్షాల ధాటికి హొయలొలుకుతూ జాలువారుతోంది. వర్షపు నీటితో వాగులు, వంకలు నిండి చెలిమి చేను ద్వారా ప్రవహిస్తూ అటవీ ప్రాంతంలోకి చేరు కుంటున్నాయి. తెల్లటి నురుగుతో పరవళ్లు తొక్కుతూ పాల ప్రవాహంలా రెండు వందల అడుగుల ఎత్తు నుండి కిందికి దూకే నీటి ప్రవాహం చూస్తుంటే ఎవరైనా మైమర



పోవాల్సిందే..!

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నూతన ఎస్‌పీగా నియమితులైన తుషార్ డూడి శనివారం మధ్యాహ్నం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి తుషార్‌డూడి

వందశాతం నమోదు చేయాలి

గర్భిణుల నమోదుపై అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : పునరుత్పత్తి, మాతా శిశు ఆరోగ్య సేవలపై కలెక్టర్ సుమిత్ కుమార్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ గర్భిణుల నమోదును 12 వారాలకే తప్పక చేయాలని సూచించారు. ఇప్పటికి 80 శాతం మాత్రమే పూర్తయిందని మిగిలిన 20 శాతం వారం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను, టీనేజ్ గర్భిణులను నమోదు చేసినప్పటి నుంచి కాన్పుకు వారం ముందు ఆస్పత్రిలో జాయిన్ చేసే వరకు తప్పక ఫాలోఅప్ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కాన్పులు ఆస్పత్రిలో జరిగేలా చూడాలని, గర్భిణులకు రక్తహీనత లేకుం డా ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. అత్యవసర సేవలు తప్ప ప్రతి ఆరోగ్య సేవలను పిహెచ్‌సిలోనే ఇవ్వాలని తెలిపారు. అందరి గర్భిణులకు అభ ఐడి క్రియేట్ చేయాలని ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద మొదటి కాన్పు, ఇద్దరు ఆడపిల్లలకు ఆరువేలు రూపాయలు ఇప్పించా లన్నారు. శిశువుల ఆరోగ్యానికి సంబంధించి వ్యాధి నిరోధక టీకాలను డ్యూ డేట్ ప్రకారం అన్ని టీకాలు ఇవ్వాలని, ఎంఆర్ 1, ఎంఆర్2 తక్కువ శాతం వున్న కారణంగా వంద శాతానికి తీసుకురావాలని తెలిపారు.



కలెక్టర్‌తో జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైద్యాధికారులు

మహిళలా  యంత్రాలా..!

- పనిగంటలు పెంచడమే సాధికారతా..!
- యథేచ్ఛగా శ్రమ, విరామ దోపిడీ
- ఇకపై 13 గంటల పని విధానం
- పరిశ్రమల్లో కార్మికుల నెత్తిన పిడుగు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల ఆర్థిక సమతుల్యత సాధ్యమవుతుంది. మారుతున్నకాలంలో సాంకేతికతకు అనుగుణంగా మహిళలు రీస్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ విభాగాల్లో ప్రావీణ్యత సాధించి పురుషులతో సమానంగా పారిశ్రామిక రంగంలో పోటీ పడుతున్నారు. ఓ రకంగా కుటుంబానికి పెద్దదిక్కుగా మారుతున్నారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, ప్రపంచీకరణకు అనుకూలంగా లేబర్ చట్టాల్లో తీసుకొస్తున్న మార్పులు మహిళలను పరిశ్రమల్లో యంత్రాలుగా మారుస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సమిష్టిగా తీసుకున్న పరిశ్రమల్లో 3 షిఫ్టులు, 13 గంటల పని విధానం మహిళలను సమిధలను చేసే ప్రమాదం ఉంది. పని గంటలను పెంచి.. మహిళలను యంత్రాలుగా మార్చడమే అసలైన మహిళా సాధికారతా..!! అన్న విమర్శలు చంద్రబాబు సర్కారు నిర్ణయంపై వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల తిరుపతి కేంద్రంగా దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ప్రజా ప్రతినిధులను ఒకచోట చేర్చి మహిళా సాధికారతపై అతిపెద్ద సదస్సును నిర్వహించారు. దాని తాత్పర్యం ఇదేనా అంటూ మహిళా కార్మిక లోకం మండిపడుతోంది.

తిరుపతి జిల్లాలో తిరుపతి, సత్యవేడు, మేనకూరు పారిశ్రామిక వాడల్లో సుమారు 15వేల మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. మొదట్లో వీరంతా సాధారణ షిఫ్టులలో 8 గంటలు పని చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు సైతం మూడు షిఫ్టులు, 8 గంటలు విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అక్కడితో ఆగకుండా 42 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి తాజాగా మూడు షిఫ్టులు, 13 గంటలు పని విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ నిర్ణయానికి ముందే గత ఆరు నెలలుగా శ్రీ సిటీ, రేణిగుంట ప్రాంతాల్లోని చాలా పరిశ్రమల్లో 12 గంటల పని విధానం అమల్లో ఉంది. 6 గంటలకోసారి రెండు విరామ సమయాలను కలుపుకొని గంటసేపు విశ్రాంతిని ఇవ్వాల్సి ఉంది. అయితే పరిశ్రమ యాజమాన్యాలు కనీసం అర్ధగంట కూడా విరామం ఇవ్వకుండా విరామ సమయాన్ని కూడా పని గంటల్లోనే కలుపుకొని మహిళలకు వేతనాలు చెల్లిస్తున్నారు. సాధారణ పని గంటల తర్వాత చేయించుకునే ప్రతి పని గంటకు అదనపు వేతనాన్ని యాజమాన్యాలు చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన రోజుకు రూ.1150 వేతనం ఇవ్వాల్సి ఉంది. అయితే పలు పరిశ్రమల్లోని యాజమాన్యాలు నెలలోని 19 రోజులకు సాధారణ వేతనం, ఆ పైబడి డ్యూటీలకు సక్రమంగా వచ్చే మహిళా కార్మికులకు ఓటి వేతనాలు అందజేస్తున్నాయి. ఇలా మహిళల శ్రమను, విరామాన్ని, పనిగంటలను దోచుకుంటున్నాయి.

ఆరోగ్యాలు పణంగా..

పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మూడు షిఫ్టుల్లో 12 గంటల పాటు విరామం లేకుండా పనిచేస్తున్నా మహిళలు ఇంటికొచ్చాక ఇంటి పనుల్లో మినహాయింపేమీ ఉండడం లేదు. పరిశ్రమల్లో 12 గంటలు పని చేసి, 3 గంటలు ప్రయాణం చేసి రోజులో 15 గంటలు అలసి పోతున్నారు. మిగిలిన 9 గంటల్లో విశ్రాంతి, ఇంటి పనులు చక్కదిద్దుకుని తిరిగి డ్యూటీలకు వెళ్ళాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మహిళలు తీవ్రమైన అనారోగ్య సమస్యల బారినపడుతున్నారు. అయినా ఆరోగ్యాలను పణంగా పెట్టి విధులకు వెళ్తున్నారు. తాజాగా మరో గంటను పెంచడంతో మహిళల ఆరోగ్యంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. పిరియడ్స్ సమయంలోనూ, ప్రెగ్నెన్సీ మహిళలకు ఈ పని వేళల పెంపు 'నరకాన్నే' చూపించనుంది.

యంత్రాలుగా మారుస్తున్నారు: ఉషా, శ్రామికురాలు



ఇప్పటికే మూడు షిఫ్టుల్లో పన్నెండేసి గంటలు పని చేస్తూ సొక్కిపోతున్నాం. మళ్ళీ ఓ గంట అదనంగా పనిచేయాలనడం అన్యాయం. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకపోగా.. వంటింటి కుందేలు ను కాస్త ఫ్యాక్టరీల్లో యంత్రాలుగా మారుస్తున్నారు. ప్రభుత్వం తీరు మారాలి. ఇంటా బయట గొడ్డుచాకిరీ చేయాల్సిందే. రాత్రి షిఫ్ట్‌ల్లో భద్రత ఏమాత్రం ఉంటుందో..

భర్త వేధింపులు

పోలీసులను ఆశ్రయించిన భార్య

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ఇంట్లో అత్తామామలు, భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. మండలం మిట్టపల్లికి చెందిన శిరీషకు కొద్ది నెలల క్రితం వివాహమైంది. తన భర్త, అత్తమామల వేధింపులు తాళలేక ఇల్లు వదిలి పారిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. బాధితురాలు కోటిరేపల్లికి చెందిన ప్రకాష్ కుమార్తె శిరీష పలమనేరు లోని సాయి చైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదివింది. సుమారు నాలుగు నెలల క్రితం ఆమెకు బైరెడ్డిపల్లి మండలం లోని మిట్టపల్లి గ్రామానికి చెందిన శివాజీతో వివాహమైంది. వివాహ సమయంలో శిరీష తల్లి దండ్రులు రూ. 5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఇచ్చి ఘనంగా పెళ్లి నిర్వహించారు. వివాహానంతరం ప్రారంభంలో భర్త శివాజీ మేలుగా ప్రవర్తించినప్పటికీ, క్రమంగా అతను క్రూరుడుగా మారాడు. అతనితో పాటు అతని తల్లి ప్రమీలమ్మ, తండ్రి సంపంగి సైతం శిరీషను పదేపదే మాటలతో, చేతుల దెబ్బలతో వేధింపులకు పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. గత రాత్రి (19 సెప్టెంబర్) సుమారు ఒంటి గంట సమయంలో శివాజీ తాను చేసిన చిన్న తప్పును పెద్దదిగా చేసి తీవ్రంగా కొట్టినట్లు, గొంతు పిసికి శారీరకంగా దాడికి పాల్పడ్డట్లు పేర్కొంది. ఈ సమయంలో అతని తల్లిదండ్రులు కూడా మద్దతుగా ఉండి వేధింపులకు పాల్పడ్డారని వాపోయింది. ఈ దౌర్జన్యాల నుంచి తప్పించుకోవడానికి శిరీష ఇంటి నుంచి పారిపోవాల్సి వచ్చిందని, చుట్టుపక్కల ప్రజల సాయంతో తన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు పేర్కొంది. అనంతరం వారు వచ్చి ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై శనివారం శిరీష బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భర్త వేధింపులపై ఫిర్యాదు చేసిన బాధితురాలు

బ్రహ్మోత్సవ కానుక పంపిణీ

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా కాణిపాకం ఆలయ సిబ్బందికి బ్రహ్మోత్సవ కానుకను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అందించారు. శనివారం మధ్యాహ్నం కాణిపాకం అతిథి గృహంలో ఆలయ సిబ్బందితో ఎమ్మెల్యే మురళీమోహన్ సమావేశమై బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు విశేష సేవలు అందించిన సిబ్బందిని అభినం దించారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రతి ఏడాదిలాగే 550 మంది కాణిపాకం దేవస్థానం సిబ్బందికి ప్రత్యేక కానుకగా బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ భక్తుల సేవలో ఎల్లప్పుడూ ముందున్న ఆలయ సిబ్బంది కృషిని ఆయన ప్రశంసించారు. వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, కాణిపాకం దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిట్టెమ్మ, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలయ సిబ్బందికి బ్రహ్మోత్సవ కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విద్యతోనే మెరుగైన జీవనం: కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

విద్య ద్వారా మెరుగైన జీవన విధానం పొందవచ్చని, ప్రతి గిరిజన కుటుంబంలోని పిల్లలందరినీ బడికి పంపి చదివించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గుడిపాల పంచాయతీ పరిధిలోని అనుపు ఎస్టీ కాలనీలో శనివారం నిర్వహించిన కలెక్టర్ 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' లో పాల్గొని మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. భావితరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దాం..' అని తెలిపారు. వర్షం వస్తే నీరు కారుతోందని తమకు పక్కా గృహాలు కావాలని కోరగా రెండు వారాల్లో చర్యలు చేపట్టాలని తహశీల్దారును ఆదేశించారు. శ్మశానానికి వెళ్లాలంటే ప్రైవేట్ వ్యక్తుల భూమి మీదుగా వెళ్లాల్సి ఉండగా సమస్యగా ఉందని దారి సమస్య పరిష్కరించాలని కోరగా తహశీల్దారు, స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి దారి సమస్య పరిష్కరించడానికి త్వరలో మండల సర్వే బృందం కాలనీకి పంపుతామన్నారు. తమిళనాడు నుండి వలస వచ్చిన వారికి కనీసం ఆధార్ కార్డులు కూడా లేవని వివరించగా ఆధార్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ పర్యటనలో గుడిపాల మండల తహశీల్దారు శ్రీనివాస్, ఎంపిడిఓ కుమార్, డ్వామా ఏ పీడీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ, పోలీస్, వైద్య, విద్యుత్ శాఖ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

26 నుండి ఇంటింటి సర్వే

ఓటర్ల జాబితాపై డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26వ తేదీ నుండి నియోజకవర్గంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు ఎలక్షన్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ అన్నారు. నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధులతో శనివారం గంగాధర నెల్లూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ లో భాగంగా ఈనెల 25వ తేదీ వరకు కార్యా లయంలో సవరణలు అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని అనంతరం 26వ తేదీ నుండి క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించ నున్నట్లు తెలిపారు. ప్రతి బూత్‌కు ప్రతి రాజకీయ పార్టీ ఒక ఏజెంటును నియమించు కోవాలని సూచించారు. గ్రామాలలో పర్యటించి నప్పుడు రాజకీయ పార్టీలకు చెందిన బూత్‌ఏజెంట్లు సిబ్బందితో కలిసి సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజూ విద్యుత్ ఉద్యోగుల దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల ఎస్‌ఈ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే దీక్షలు శనివారం రెండో రోజూ కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జేఏసి నాయకులు యగ్నేశ్వరావ్, రాజశేఖర్ మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు విద్యుత్ ఉద్యోగల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినా అవి హామీలుగా మిగిలి పోవడంతో ఆందోళన కార్యక్రమాలకు పూనుకోవాల్సి వచ్చింద న్నారు. విద్యుత్‌శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయక పోవడంతో ఒత్తిడి పెరుగుతోందని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు క్రమ బద్ధీకరణ కోసం ఏండ్ల తరబడీ వేచి చూస్తు న్నారన్నారు. జేఎల్ఎం పోస్టులు భర్తీ చేసిన రెగ్యుల్ ఉద్యోగులకు అందే ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదన్నారు. అత్యంత ప్రమాదర విధులు నిర్వహిస్తున్న వారు మరణించినా ఎలాంటి సాయం అందే పరిస్థితి లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు విద్యుత్ ఉద్యోగుల జేఏసి నేతృత్వంలో పోరాటాలను తీవ్రం చేయనున్నట్లు చెప్పారు.

విజయపురం ఎంపీపీగా మంజుబాలాజీ

కలెక్టర్ నుంచి ఉత్తర్వులు

ప్రజాశక్తి-విజయపురం: విజయపురం ఎంపీపీగా మంజుబాలాజీకి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్‌వోసీ నెంబరు ఈ1/328/2021 మేరకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం నియామక ఉత్తర్వుల పత్రాన్ని వైస్‌ఎంపీపీ మంజుబాలాజీ అందుకున్నారు. విజయపురం మండల ఎంపీపీగా ఉన్న టి జమున ఆరోగ్య సమస్యల వల్ల తన పదవికి రాజీనామా చేస్తూ రాజీనామా పత్రాన్ని ఈ నెల 15వ తేదీ జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు సమర్పించిన విషయం విదితమే. 1994 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 149 సబ్‌సెక్షన్ 1 మేరకు ఎంపీపీకి రాజీనామా సమర్పించే హక్కు ఉన్నందున ఆమె రాజీనామా ఆమోదించి గెజిట్ 14/2021లోని నిబంధనల మేరకు వైస్ ఎంపీపీకి బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి నివాసానికి వెళ్లిన వైస్‌ఎంపీపీ నియామక ఉత్తర్వుల పత్రాన్ని ఆమెకు అందజేసి ఆశీస్సులు పొందారు. పదవిని బాధ్యతాయుతంగా నిర్వరిస్తూ ప్రజలకు సేవలు అందించాలని మాజీ మంత్రి ఈ సందర్భంగా వైస్ ఎంపీపీకి సూచించారు.



కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని అందుకుంటున్న మంజుబాలాజీ

రోడ్లపై గుంతలు..ప్రయాణికులకు ఇక్కట్లు..

మరమ్మతులు చేయాలని ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రోడ్లు, భవనాలశాఖ నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ప్రధాన రహదారులన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడికక్కడ రోడ్లు గుంతలు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పుంగనూరు నుండి శంక్రయలపేట వెళ్లే రహదారి, కత్తార్లపల్లె దగ్గర ఏర్పడిన గుంతలు వద్ద ఉపాధ్యాయులు శనివారం తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నిత్యం విపరీతమైన రద్దీ వున్న, పుంగనూరు, రోడ్డు కత్తార్లపల్లె దగ్గర అతిపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోయకొండ కు వెళ్లే భక్తులు, ప్రమాదాలకు లోనవుతున్నారని, గత కొన్ని సంవత్సరాలుగా పుంగనూరు పుంగమ్మ చెరువు కట్ట నుంచి కత్తార్లపల్లె వరకు దాదాపు 3 కిలో మీటర్లు రోడ్ అధ్వానంగా వుందని, కనీసం కత్తార్లపల్లె దగ్గర ఏర్పడిన అతిపెద్ద గుంతలను త్వరితగతిన పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్ రెడ్డి, గోపి, జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీధర్, ప్రసన్నలక్ష్మి, బాబాజాన్, అమర్నాథ్, మురళి, సరస్వతి అన్నదొరై, రఫీ ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొన్నారు.



రోడ్లపై గుంతలు పూడ్చాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థినుల ప్రతిభకు గుర్తింపు

30 మంది డివిజన్ స్థాయికి ఎంపిక

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన క్రీడల పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినులు అదరగొట్టారు. వివిధ విభాగాలలో పోటీలు పడి, 30 మంది విద్యార్థినులు డివిజనల్ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమైంది. శనివారం నాడు స్కూల్ ప్రిన్సిపాల్ సుమిత్ర ఈ విజేతలందరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'క్రీడలు, విద్యారంగం రెండింట్లోను విద్యార్థులు ముందుకు సాగాలంటే ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల నిబద్ధత ఎంతో కీలకమన్నారు. మన గురుకుల పాఠశాల పేరు విజయాలతో మరింత వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల విజయాన్ని ప్రశంసిస్తూ, వారిని ఉత్తమ స్థాయికి తీసుకెళ్లే విధంగా నడిపించనున్నామని తెలిపారు. సీనియర్ ఖో-ఖో జట్టు విజేతలు.. కెప్టెన్ వేమశ్రీ, సీనియర్ వాలీబాల్ జట్టు విజేతలు..కెప్టెన్ సంజీత, కబడ్డీలో కెప్టెన్ రెడ్డి లాస్య.ఈ జట్లతో పాటు మరో 30 మంది విద్యార్థినులు వివిధ విభాగాలలో గెలిచి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. వీరందరికీ పాఠశాల సుమిత్ర ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



విజేతలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నీవానది వరద ముప్పు తప్పేనా?

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అధిక వర్షాలు కురినప్పుడల్లా జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఆరు కిలోమీటర్లు పారే నీవానది పరిసర ప్రాంతాల ప్రజలు వణికిపోతుంటారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఇక్కడి ప్రజల అవస్థలు మాత్రం తీరడం లేదు. నీవానది దాటేందుకు బ్రిడ్జిలు లేవు. ఈ నదిలో వరద నీరు పొంగితే తేనబండ, దర్గామిట్టి ప్రజలకు చిత్తూరు నగరంతో కనెక్షన్ కట్ అవుతుంది. బెంగుళూరు బైపాస్ మీదుగా తేనబండ, గంగా సాగరం, వీరభద్రకాలనీ, దర్గామిట్ట దాదాపు ఏడు కిలోమీటర్లు చుట్టుకొని నగరంలోకి రావాల్సి ఉంటుంది. చిన్నపాటి వర్షానికే తేనబండకు చిత్తూరు నగరానికి రావాలంటే అతికష్టం. 2021 వరద సమయంలో అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి.

కాంక్రీట్‌వాల్ నిర్మాణం కోసం గత అసెంబ్లీ సమావేశంలో చిత్తూరు ఎంఎల్ఏ గురజల జగన్మోహన్ ప్రతిపాదించారు. నీవా నది పరివాహక ప్రాంతాల్లోని దాదాపు 3వేల మంది ప్రజలకు నీవానదికి ఇరువైపుల కాంక్రీట్‌వాల్ నిర్మాణం వల్ల వరద ముప్పు తప్పుతుందని ఇందుకోసం నిధులు కేటాయించాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో నీవానది కాంక్రీట్‌వాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నారు. 2021లో కురిసిన అధికవర్షాలకు చిత్తూరు జిల్లా వణికి పోయింది. ప్రాజెక్టులు, వాగులు వంకలు పొర్లి పొంగాయి. చెరువులు నిండాయి. చిత్తూరు నగరంలోని లోతట్టు ప్రాంతా ల్లో ఆవాసాల్లోకి భారీ వర్షపునీరు చేరు చేరింది. నీవానది పరివాహక ప్రాంతా లైన వీరభద్ర కాలనీ, తేనబండ, కైలాస పురం వర్షపు నీటితో మునిగి పోవడంతో దాదాపు 300 మంది నిరాశ్రయులయ్యారు. వీరిని నెలరోజుల పాటు పునరావాస కేంద్రాల్లో ఉంచా రు. వర్షాల సమ యం లో ఈ ప్రాంతాల్లో పేదల కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

నీవానదిలో వర్షపు నీరు పారేలా వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నా నీవానది పరిసరాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు వరద ముప్పు తప్పడం లేదు. కాంక్రీట్‌వాల్ నిర్మాణమే పరిష్కార మార్గం. 2014 ఎన్నికల సమయంలో నీవానది పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత ఎంఎల్ఏ నీవానది వరద ముంపునకు పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇచ్చారు. ఆ మేరకు అసెంబ్లీలో నీవానది పరిసర ప్రాంతాల ప్రజల కష్టాలను అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు. కాంక్రీట్‌వాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి వరద ముంపు నుండీ కాపాడాలని నీవానది పరిసర ప్రాంతాల్లోని ప్రజలు కోరుతున్నారు.



చిన్నపాటి వర్షానికి శుక్రవారం తేనబండ వద్ద బ్రిడ్జిపై పారుతున్న వరద నీరు



తాడు సాయంతో రోడ్డు దాటుతున్న మహిళలు, విద్యార్థులు

ఎస్‌టి కాలనీ అభివృద్ధి: టిడిపి



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్‌టి కాలనీ వాసులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ చొరవతో వెదురుకుప్పం ఎస్టీ కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని వెదురుకుప్పం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి పేర్కొన్నారు. ఎమ్మెల్యే థామస్ 95 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు, తంగేళ్లమిట్ట నుంచి ఎస్టీ కాలనీ లింకు రోడ్డు వరకు 85 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ఎస్టీ కాలనీలో 25 కుటుంబాలకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, నీటి పైపులైను, ఇంటింటికి కుళాయిలు, అన్ని అభివృద్ధి పనులు, ఎంజాయ్ మెంట్‌లో ఉన్న భూములకు పట్టాలు, ఇంటి పట్టాలు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చొరవతో చేస్తామని మోహన్ మురళి పేర్కొన్నారు. త్వరలోనే గ్రామానికి ఎమ్మెల్యే థామస్ చేతుల మీదుగా రోడ్లకు భూమిపూజ, చెక్కులు పంపిణీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మోహన్ మురళిని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో, వెలుగు ఏపిఎం పరుశురామిరెడ్డి, వెలుగు సిసి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి కోదండరెడ్డి పాల్గొన్నారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ



నీటి శుద్ధి యంత్రం వితరణ చేస్తున్న దాత

ప్రజాశక్తి - విజయపురం: స్థానిక మండలం శ్రీహరి పురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి దొమ్మ రాజు సుమన్ నీటి శుద్ధి యంత్రాన్ని ప్రధానోపాధ్యాయులు వెంకట రాజుకు శనివారం వితరణ చేశారు. విద్యార్థులకు సురక్షిత మంచినీరు అందించాలని ఉద్దేశంతో నీటి శుద్ధి యంత్రం అందించామని దాత సుమన్ పేర్కొన్నారు. దాతను పేరెంట్స్ కమిటీ సభ్యులు సత్కరించారు. ఉపాధ్యాయులు సూరలక్ష్మి, గ్రామస్తులు సురేష్, నరేష్, జయరామరాజు, సుజాత, పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో మౌలిక వసతులు: తహశీల్దారు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం చెక్కునత్తం హరిజనవాడలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తామని తహశీల్దారు చిట్టిబాబు పేర్కొన్నారు. చెక్కునత్తం హరిజనవాడలో శనివారం తహశీల్దారు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ వేణుగోపాల్, టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి మణి, మునిరత్నం, బాబు, వెంకటాచలం, రమేష్, వినోద్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ ఉన్నత పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ముందస్తు దసరా వేడుకలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం లక్ష్మీనరసింహ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తుగా దసరా పండుగ వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. పాఠశాలలో విజయదశమిలో భాగంగా విద్యార్థులు వివిధ అమ్మవారి వేషధారణలో కనిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. విద్యార్థుల వేషధారణ నివేదనపు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దిలీప్ కుమార్, ధనుంజయ రెడ్డి, పురుషోత్తం, హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని పలమనేరు మండల నాయకులు శనివారం సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ పెంచుపాడు గ్రామానికి చెందిన రామూర్తి నాయుడుకు పట్టణంలోని రాఘవాపల్లెలో వారి స్వగృహంలో ఇటీవల కాలంలో భారీ దొంగతనం జరిగింది. దీంతో పట్టణంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థానిక పోలీసులు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పాటు ఎమ్మెల్యేకు తన గోడును విన్నవించుకున్నారు. దీంతో దొంగతనం కేసులను ఛాలెంజింగ్ గా తీసుకొని వెంటనే పరిష్కరించాలని పోలీసులను ఎమ్మెల్యే ఆదేశించడంతో పాటు బాధితునికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. ఇలా ఉండగా దుండగులు కొద్ది రోజులు ముందు దొంగతనానికి పాల్పడిన నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి సొత్తును రికవరీ చేశారు. దీంతో బాధితుడు స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి చూపించిన చొరవను అభినందించి మండల నాయకులతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు రెడ్డి, స్వతంత్ర బాబు తదితరులున్నారు.

నుంజర్ల ప్రాజెక్టు పరిశీలన

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండల పరిధిలోని భూమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో నుంజర్ల ప్రాజెక్టు యాదమరి తహశీల్దారు పార్థసారథి మండల అడ్మినిస్ట్రేటివ్ అధికారి వేణు శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు కాలువలు నీరు ప్రవహిస్తూ ఉండటంతో పిల్లలు పెద్దలు నీటి ప్రవాహానికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్కూలు బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి -శాంతిపురం: బెంగళూరుకు చెందిన ఓ కార్పొరేట్ సంస్థ ప్రతినిధులు శనివారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్కూలు బ్యాగులను పంపిణీ చేశారు. మండలంలోని సోన్నేగానిపల్లె పంచాయతీ నాయనపల్లె, కెనమాకులపల్లి పంచాయతీ బదుగుమాకులపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని అందించారు. ఈ సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా వరుసగా నాలుగవ ఏట మొత్తం 324 మంది స్థానిక విద్యార్థులకు బ్యాగులను అందిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు జి ఎం అశ్వత్ బాబు, జేఏం కృష్ణమూర్తిలు తెలిపారు.

పాము కాటుపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిఎం సుధారాణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ పాముకాటు పై అవగాహన నిర్వహించారు. విషపూరిత పాముకాటుకు ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని విషపూరిత పాము కాటుపై ఎలా ప్రథమ చికిత్స చేసుకోవాలి? వెంటనే చికిత్స తీసుకోకపోతే జరిగే ప్రాణ నష్టాల గురించి పాము కాటుపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ ఈ అవ గాహనతో కాటు పట్ల కలిగే దుష్పరిణామాలను తెలుసుకొని జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వెంకట ప్రసాద్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష,డాక్టర్ నవీన్ తేజ్ రాయి, శ్రీవాణి,తదితర ప్రోగ్రాం అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌సీ విజేతలకు సన్మానం



డీఎస్‌సీ విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం హాకింగ్స్ పాఠశాలలో ఉపాధ్యాయులకు పనిచేస్తూ డీఎస్సీలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉపాధ్యా యులను హాకింగ్స్ స్కూల్ యాజ మాన్యం ఘనంగా సత్కరిం చింది. హాకింగ్స్ పాఠశాలలో పనిచేస్తున్న శబరినాథ్, మోహన్ కుమార్ డీఎస్సీలో ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ హాఫీజ్, ప్రిన్సిపాల్ షబ్బీర్ పేర్కొన్నారు.

కేఈసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యు యేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమాజానికి సేవ చేయాలని, విద్యాసంస్థ విశ్వవిద్యాలయం పట్ల కృతజ్ఞత చూపాలని గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అనంతపురం జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ సుదర్శన రావు సూచించారు. చదువులు పూర్తి చేసుకున్న వారు తమ జ్ఞానాన్ని సమాజాభివృద్ధికి వినియోగిం చాలని ఇంజనీరింగ్ పట్టా పొందడం ఒక ఆరంభం మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజ్, కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్ బాబు వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ పాల్గొన్నారు.

నగరి పోలీసులకు అభినందనలు

ప్రజాశక్తి - విజయపురం(నగరి): మతిస్థిమితం లేని మహిళను వారి బంధువుల చెంతకు చేర్చిన నగరి పోలీసులను ఎస్‌పి తుషార్ డూడి అభినందించారు. ఈ నెల 16వ తేదీ, చిత్తూరు నగరి పట్టణంలో సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగిన ఒక మహిళ రోడ్లపై తిరుగుతూ, వచ్చే వెళ్లే వారికి గొడవ పుట్టిస్తూ, నివాస ప్రాంతాల్లో సమస్యలు సృష్టిస్తున్న సంగతిని నగరి పోలీసులు గమనించారు. నగరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ యన్ విక్రమ్ వెంటనే ఈ విషయం గురించి నగరి డీఎస్‌పి సయ్యద్ మహమ్మద్ అజీజ్‌కి తెలిపారు. వారి ఆదేశాల మేరకు, నగరి ఎస్ఐ విజయ నాయక్, మహిళా కానిస్టేబుల్ భార్గవి ఆ మహిళ వివరాలు సేకరించి వారి బంధువుకు అప్పగించారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి: సిపిఓ శ్రీనివాస్

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): మార్గదర్శులను, బంగారు కుటుంబాలను గుర్తించాలని సిపిఓ శ్రీనివాస్ సూచించారు. శనివారం జెడ్పీ కార్యాలయంలో ఎన్టీఆర్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర – పి 4 పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఓ మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్ బాగస్వామ్యంగా, సమాజంలోని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను (బంగారు కుటుంబాలు) సహాయం చేయగలిగిన స్థాయిలో ఉన్న కుటుంబాలతో (మార్గ దర్శులతో) అనుసంధానించి ఆయా పేద కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించి వారిని పేదరికం నుండి పైకి తీసుకు వచ్చేలా ప్రోత్సహించే కార్యక్రమమే పి 4 అన్నారు. ఈ జిల్లా స్థాయి కార్యక్రమానికి ప్రతి మండలం, మున్సిపాల్టీ నుండి పది మంది చొప్పున సిఎస్ డబ్ల్యుఎస్ సిబ్బంది, ఐదుగురు చొప్పున మాస్టర్ ట్రైనర్స్ ని ఎంపిక చేసి వారికి ఏపీఎస్‌డిపిఎస్ సిబ్బంది (విజయవాడ) వారి ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమానికి డిఇ అండ్ ఎస్వో (సిపివో) వారి సిబ్బంది, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు జెడ్‌పి సిఇవో, డ్వామా పీడీ, డిపివో, డిఐసి జిఎం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరీ బాధ్యత: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టరు మురళీమోహన్ పేర్కొన్నారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్షాలు నాటారు. మానవహారం, ప్రతిజ్ఞతో ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారు పాళ్యం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిట్టెమ్మ, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, నాయకులు గోపి, మండల నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా ప్రతినెలా 3వ శనివారం పారిశుధ్య నిర్వహణ లో భాగంగా పలమనేరు పురపాలక సంఘం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, మున్సిపల్ కమిషనర్ , సబ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఆఫీస్ వె నుక, అగ్రహారం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డేగల ప్రభాకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ , మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దిన్, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: పరిసరాల పరిశుభ్రతతోనే.. ఆరోగ్యకర మైన జీవితం అని టిడిపి నాయకులు మురళి నాయుడు అన్నారు. శనివారం పూతలపట్టు పంచాయతీలోని గువ్వల కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బంది గువ్వల కాలనీలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కాలనీలో పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచి మా శిలామణి, పిఓపిఆర్డి అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు (యాదమరి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చిత్తూరు డిఆర్డిఏ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు జిల్లా సమాఖ్య ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రవికుమార్, ఏపీఎంలు హేమ పలువురు జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల పరిధిలోని కేపీ అగ్రహారం గ్రామ పంచాయతీ ఎస్టి కాలనీలో పారిశుధ్య పనులు ఎంపీడీవో టీ చంద్రమౌళి, సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం మెరుగుపడినప్పుడే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని పిలుపు నిచ్చారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌టి కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బివి మధుసూదన్, ఏపీవో కవిత, ఐసిడిఎస్ సూపరువైజర్ అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : కార్వేటినగరం జిల్లా పరిషత్ బాలికలఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మర్రి శేఖర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ భారతి వరలక్ష్మి కస్తూరి చిత్రా గీత వేణుగోపాల్ రెడ్డి జయదేవ్, రామ్మోహన్ మునీంద్ర శశికాపూర్ కన్నయ్య పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : నగర ప్రజలు, నగరపాలక సిబ్బంది సమిష్టి బాధ్యతతోనే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందని మేయర్ ఎస్ అముద పేర్కొన్నారు. "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" లో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమాన్ని నగరపాలక పరిధిలోని వన్నియర్ బ్లాక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్వో డా. పి లోకేష్, స్థానిక కార్పొరేటర్ శశి పాఠశాలలో మొక్కలు నాటారు. స్థానిక మహిళలు, విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యుగంధి, ప్రముఖులు అట్లూరు శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్వేటినగరంలో

చిత్తూరు అర్బన్: స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో గ్రీన్ ఏపీ పై అందరూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుధారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : ఎస్పీ తుషార్ డూడి జిల్లా పోలీసు కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొని మొక్కలు నాటి అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇన్‌చార్జి అడ్మిన్ ఎస్‌ఆర్ రాజశేఖర్ రాజు, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిపురం: కెనమాకులపల్లె పంచాయతీకి చెందిన బోయనపల్లిలో ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శివయ్య, పంచాయతీ కార్యదర్శి స్వాతి, టిడిపి ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, సర్పంచులు విజయరామిరెడ్డి, ఏవి జయరాం, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విజయపురం (నగరి) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సంత మైదానంలో పారిశుధ్య కార్మికులతో కలిసి ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. అనంతరం సత్రవాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు ప్రత్యక వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రంలో మెప్మా పీడీ డాక్టర్ రవీంద్ర, పురపాలక సంఘ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

కుప్పం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒకరు తమ బాధ్యతగా తీసుకోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, కుప్పం మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, గుడిపల్లి మండల పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఇక్కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు .



పౌష్టిక ఆహారం అందిస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

మహిళల ఆరోగ్యమే ధ్యేయం..

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండలంలోని మాధవరం లో శనివారం నిర్వహించిన స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్‌లో యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బావి భారతం బాగుండాలంటే అది మహిళా ఆరోగ్యంతోనే సాధ్యమన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రధానంగా వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల నుంచి వారిని రక్షించే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈనెల 25వ తేదీన నైపుణ్యం గల వైద్యులతో యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని మండలంలోని ప్రజలందరూ హాజరై వైద్య సేవలు పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర నాద రెడ్డి, ఎం.ఎల్.హెచ్.పీలు దివ్యశ్రీ,భానుప్రియ, లోకేశ్వరి, దుర్గా ప్రసన్న, విష్ణు ప్రియ, సౌందర్య, మహిళా ఆరోగ్య కార్యకర్తలు భాగ్యమేరి, గజలక్ష్మి, అపర్ణ శిల్ప, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం మండలం, సిడి కంద్రిగ పంచాయతీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ అంబరీష్ రాజు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): శనివారం సత్రవాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుగ్గ అగ్రహారం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఇందిరాప్రియదర్శిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని కోసలనగరం సచివాలయ కేంద్ర ఆవరణలో శనివారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కోసలనగరం సింగిల్ విండో చైర్మన్ బాబుయాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వనజ, సీడీపీవో ఇందిరప్రియదర్శిణి, సీహెచ్వి భాగ్యలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు కళా ,సరస మునెమ్మ , వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గర్భిణులకు పౌష్టికాహారం తోనే ఆరోగ్యం మునగాకుతో ఎంతో ఆరోగ్యకరమని మహిళ శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి అన్నారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా మండలంలో పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం మోత రంగన పల్లి, ఆవలకండిగ ఇంద్రానగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. బాలగంగానపల్లి గ్రామంలో గర్భిణులతో, తల్లులతో సమావేశమయ్యారు. పిల్లల పెరుగుదలలో పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అదే గ్రామంలో గర్భిణి సంగీత ఇంటి వద్ద మునగ చెట్టును నాటి మునగాకుతోనే మహిళలకు ఆరోగ్యకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మ సునందన, తూగుండ్రం పిహెచ్సి డాక్టర్లు ప్రవీణ్, మౌనిక సూపర్వైజర్లు అనురాధ, సంగీత, మాజీ సర్పంచ్ దేవరాజులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెండో రోజూ దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఆవరణలో రిజిస్ట్రేషన్లు ప్రక్రియలో పనిచేసే దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ రెండో రోజూ శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా దస్తావేజు లేఖరులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సబ్ రిజిస్ట్రారు సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ పెన్ డౌన్‌ను నిర్వహించారు.



ఉచిత సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - యాదమరి: మండలంలో కె గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ మీడియట్ చదువుతున్న 28 మంది బాలికలకు గ్లోబల్ కంపాషన్ ఐఎన్ సి(యుఎస్ఏ)కె ఉమ సహకారంతో షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ఎల్ జోషఫ్ దంపతులు ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేశారని హెచ్‌ఎం లలిత తెలిపారు. వీటి విలువ సుమారు రెండు లక్షలు రూపాయలు ఉంటుందని ఆమె చెప్పారు. దంపతులు గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సుమారు నాలుగు లక్షల యాభై వేల రూపాయలు విలువైన ల్యాబ్ మెటీరియల్స్ , యూనిఫారం, స్టడీ మెటీరియల్, కాలెజి విద్యార్థులకు అందించారు. హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న జువాలజి అధ్యాపకులు సి మహేష్ చొరవతో ఈ సహాయ సహకారం జోషఫ్ దంపతులు అందిస్తూ న్నారు. పిఆర్‌టి రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ కనకాచారి మాట్లాడుతూ మన పాఠశాలలో సి మహేష్ పనిచేయడం కాలెజి అభివృద్ధికి వారి కృషిని ప్రశంసించారు. అంకిత భావంలో పనిచేసే ఇలాంటి అధ్యాపకులు ఇక్కడ పనిచేయడం చాలా సంతోషంగా వుందని మండల విద్యాశాఖ అధికారులు టి రుక్మిణమ్మ హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మధుసూదన్, కనకాచారి, సుధాకార్, రాజేశ్వరి, మదన్ మోహన్ రెడ్డి, సుల్తాన్, అరుణ, ఆశ రమాదేవి, కె భారతి, షణ్మగం, చిన్నదొరై, భారతి, మంజులత, మంజుల , రంగనాథం, చిట్టిబాబు ,రాకేష్, అక్తర్, బాలికల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రత్యేక ప్రతిభావంతుల కలలు సాకారం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తవణంపల్లి: ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థుల కలల సాధనకు కూటమి ప్రభుత్వం పటిష్టమైన కృషి చేస్తోందని పూతలపట్టు శాసన సభ్యులు మురళీమోహన్ పేర్కొన్నారు. శనివారం తవణంపల్లె మండల కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో తవణంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో పూతలపట్టు నియోజకవర్గ స్థాయి మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరానికి పూతలపట్టు, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లి, యాదమరి మండ లాలకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులు హాజరయ్యారు. నడవలేని పిల్లలు, వినికిడి లోపం ఉన్న విద్యార్థులు, చూపు సమస్యలు గల వారు, బుద్ధిమాంద్యం కలిగిని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు వైద్యులు అందించారు. 6 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు వున్న ప్రత్యేక అవసరాలు కల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ ఈ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రోత్సహించారు. ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ సునీల్ చౌదరి, మాజీ మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, నాయకులు ప్రవీణ్ కుమార్, పట్నం గోపి, తవణంపల్లె మండల విద్యాశాఖ అధి కారులు హేమలత, మోహన్ రెడ్డి, వైద్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులతో ఎమ్మెల్యే

'నోబెల్'లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక

ప్రజాశక్తి -శాంతిపురం : నోబెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుక ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోబెల్ స్కూల్ చైర్మన్ సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అధికారికంగా కొన్ని పాత్రలు, బాధ్యతలను అప్పగించే ఒక ఉత్సవం అని ప్రధాన విద్యార్థులు, హౌస్ కెప్టెన్‌లు వంటి విద్యార్థి నాయకులకు వారి బాధ్యతలను అధికారికంగా అప్పగించడం, క్రమశిక్షణ, నాయకత్వం వంటి విలువలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఒక ముఖ్య ఉద్దేశమనిన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ నాయకత్వానికి విద్యార్థులలో విలువలను పెంపొందించడం, సమగ్రత, క్రమశిక్షణ, సేవ వంటి విలువలను పెంచడానికి ఇది దోహద పడుతుందని పాఠశాల విద్యార్థులలో ఐక్యత, స్ఫూర్తిని పెరుగుతుందన్నారు. హౌస్ కెప్టెన్‌లు గా ఎంపికైన విద్యార్థులకు వారికి గౌరవ సూచకంగా చిహ్నాలు, బ్యాడ్జ్‌లు అందించారు. అనంతరం విద్యార్థి నాయకులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రమాణం చేస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారామ్, మండల టిడిపి అధ్యక్షులు ఉదయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, సినీ యాక్టర్ జెమినీ కాంత్, ఎంఈఓ చంద్రమ్మ, పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి, నోబెల్ స్కూల్ ఫౌండర్ నారాయణప్ప, పలువురు పాల్గొన్నారు.



నోబెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుక

క్రైం న్యూస్

భారీ దొంగతనం

రూ.ఐదు లక్షల గృహపరికరాలు మాయం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పుంగనూరు జాతీయ రహదారిలో గల కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న భానుమతి గుజిరి అంగడిలో ముష్కరులు భారీ దొంగతనానికి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో దుకాణం వెనుక ప్రహరీ గోడలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు సుమారు ఐదు లక్షల రూపాయల విలువైన కాపర్, అల్యూమినియం ఉత్పత్తులు, ఇతర గృహ పరికరాలను అపహరించినట్లు బాధితురాలు భానుమతి తెలిపారు. ఈ ఘటనపై ఆమె బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పట్టణం కొత్తపేటకు నాగలరాళ్ల వీధికి చెందిన లెక్చరర్ దయానంద శెట్టి ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తూ గంగవరం సర్కిల్ పరిధి ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రిఫర్ చేయగా మార్గమధ్యంలో బంగారుపాలెం వద్ద మృతి చెందినట్లు తెలిపారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మున్సిపల్ పరిధి నత్తం కండ్రిగ ఉన్నత పాఠశాలలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న అనిత, లక్ష్మీ శైలజలను ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో అవార్డు గ్రహీతలను ప్రధానోపాధ్యాయులు, సహ ఉపాధ్యాయులు దుశ్శాలువలత, పూల దండలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. అత్యుత్తమ విద్యాబోధన ద్వారా విద్యార్థులకు చేసిన సేవలకే ఉపాధ్యాయు లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు నాదముని, రామరాజు, కే బాబు, పద్మజ, విఎల్ బాబు, ముని కుమార్, సుమతి, మురళి పాల్గొన్నారు.

ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు సేవ అద్భుతం

చిత్తూరు జిల్లా జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో



ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): గత సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ముందెన్నడూ లేని రీతిలో అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించి, అనతికాలంలోనే చిత్తూరు కీర్తిని పార్లమెంటు లో ప్రస్తావించడమే కాకుండా, పార్లమెంటుకు క్రమశిక్షణగా హాజరు కావడం, నిరంతరం తన ప్రశ్నలతో, తన ప్రాంత అభివృద్ధికి కావలసిన అంశాలపై, అభివృద్ధికి చేస్తున్న కృషి అద్భుతమని చిత్తూరు జిల్లా జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో శనివారం పేర్కొన్నారు. 2024-25వ సంవత్సరానికి సంబంధించి లోక్ సభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరు నివేదికను పార్లమెంట్ ప్రతినిధులు ఇటీవల విడుదల చేశారు. ఈ నివేదికలో ప్రశ్నల కేటగిరీలో చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు మొత్తం 82ప్రశ్నలతో మూడో స్థానంలో నిలవడం, 92.65 శాతం హాజరుతో నాల్గవ స్థానంలో నిలవడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా ఆయనకి జనసేన తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: తహశీల్దారు

ప్రజాశక్తి - యాదమరి: ఓటివారిపల్లి ఎస్టీ కాలంలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తహశీల్దారు పార్థసారథి తెలిపారు. శనివారం ఓటివారి పల్లి ఎస్టీ కాలనీలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం, భావితరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దాం అని తెలిపారు. . ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలన్నారు. కాలనీ వాసులు తమకు పక్కా ఇల్లు లేవని, ఉన్న గృహాలు వర్షం వస్తే నీరు కారుతుందని తమకు పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు.శ్మశానానికి వెళ్లాలంటే దారి లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. గ్రామంలో కొంతమందికి ఆధార్ కార్డులు కూడా లేవని తెలుపగా వెంటనే ఆధార్ కార్డులుమంజూరుచేస్తామన్నారు. ఎస్టి కాలనీలోని 19 ఇళ్లకు ఇల్లు రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వేణు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, శ్రీనాథ్ రెడ్డి, యోగానంద రెడ్డి, షాబాజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కుప్పం: మండల స్థాయిలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ ఐ పోటీల్లో కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ తెలిపారు. అండర్ 14 కోకో విభాగంలో బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బ్యాడ్మింటన్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విధేయ్ జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఆయన పేరుకున్నారు. అండర్ 17 కోకో లో బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలువగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీజీమ్ కొండల రావు , ఎ జీమ్ ఫణికుమార్ , ఆర్ ఐ ప్రసాద్ , కో ఆర్డినేటర్ మునిరెడ్డి, బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, నరేష్, ప్రదీప్, ఉపాధ్యాయి పాల్గొన్నారు.

నేడు జనతా బజార్ మహాజన సభ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ది బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్, జనతా బజార్ 51వ మహాసభ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు సూపర్ బజార్ ప్రాంగణంలో నిర్వహిస్తామని ది బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ది బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు సూచించారు.

హెచ్‌ఐవిపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సంచారం ప్రచార వాహనం ద్వారా హెచ్‌ఐవి పై విస్తృత ప్రచారం నిర్వహించ నున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి తెలిపారు. శనివారం హెచ్‌ఐవి, ఎయిడ్స్ అవగాహన సంచార ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం చిత్తూరు జిల్లాలో 15 రోజులపాటు నగరి, చిత్తూరు, పలమనేరు ,కుప్పం నియోజక వర్గాలలో వివిధ హైరిస్క్ , జన సమూహ ప్రాంతాలలో ఉదయం, సాయంకాలం అవగాహన కార్యక్రమాలు వీడియో డిస్ప్లే చేసి అవగాహన కల్పిస్తారు. ప్రజలు హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన తోటి సమాజంలో ప్రజలందరికీ అవగాహన కలుగజేసి తద్వారా ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ లేని సమాజ స్థాపనకు కృషి చేద్దామన్నారు. ఎవరికైనా అనుమానం ఉంటే ఐసిటిసి సెంటర్ నందు ఉచితంగా రక్త పరీక్ష చేయించుకుని నివృత్తి చేసుకోవాలన్నారు. ఒకవేళ పాజిటివ్ వస్తే ఏ ఆర్ టి సెంటర్ నందు ఉచిత మందులతో, మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఎలాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నోడల్ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ హనుమంతరావు ,డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, డాక్టర్ నవీన్ తేజ్ రాయి, వేణుగోపాల్, జార్జి, జయరాముడు,శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.